క్లుప్తంగా

పర్యావరణ సేవకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న గోపాల్

ముదిగుబ్బ: పర్యావరణ సేవకుడు గుంజేపల్లికి చెందిన గుట్ట గోపాల్‌ను భారత సేవా రత్న అవార్డు వరించింది. శనివారం బెంగళూరులోని జక్కూరు సోమలరాజు ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు భారత సేవా రత్న అవార్డు(2024)ను గోపాల్‌కు అందజేశారు. గత 14 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికి గాను తనకు అవార్డు దక్కినట్లు గోపాల్ పేర్కొన్నారు.

గ్రామాల స్వచ్ఛతకు సహకరించండి

బత్తలపల్లి: స్వచ్ఛతా హి సేవా–2024లో మండలంలోని గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ సాయిమనోహర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు 'స్వభావ్ స్వచ్ఛతా–సంస్కార్ స్వచ్ఛత'లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. పంచాయతీ సిబ్బంది తోపుడు బండ్లు, హోటళ్లలో ఆహారాన్ని విక్రయించే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. శ్రమదానం కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు.

రైతులందరూ ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలి



డి.చెర్లోపల్లిలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ నాగార్జున

బత్తలపల్లి: గడువులోపు మండలంలోని రైతులందరూ ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఓబిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న రైతులందరూ ఏఏ పంటలు వేశారో తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ చేయించుకుంటేనే పంటల బీమా, పంట నష్టపరిహారం వంటివి వర్తిస్తాయన్నారు. ఏ ఒక్క రైతును కూడా వదలకుండా పంట నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. రైతులు కూడా గ్రామ వ్యవసాయ సహాయకులకు సహకరించాలని కోరారు. ఎంపీఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనిర్ధారణ్‌కు మదర్‌థెరిస్సా అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సత్యనిర్ధారణ్

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన డాక్టర్ సత్యనిర్ధారణ్‌కు మదర్ థెరిస్సా అవార్డు అందుకున్నారు. బెంగళూరులోని సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా పదేళ్లుగా రెడ్‌క్రాస్ సొసైటీలో విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ సత్యనిర్ధారణ్‌కు శనివారం అవార్డును అందించారు. తనకు ఈ అవార్డు అందించడం చాలా సంతోషంగా ఉందని, తనపై ఇంకా బాధ్యతలు పెరిగాయని సత్యనిర్ధారణ్ పేర్కొన్నారు.

సెమీఫైనల్ విజేతగా ఎన్.పీ.కుంట జట్టు



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న సందీప్

ఎన్‌పీకుంట: ఉపాధ్యాయుల స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో సెమీఫైనల్ విజేతగా ఎన్.పీ.కుంట జట్టు నిలిచింది. కదిరి ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానంలో శనివారం గాండ్లపెంట, ఎన్.పీ.కుంట జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. నిర్ణీత 15 ఓవర్లలో గాండ్లపెంట జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేయగా ఎన్.పీ.కుంట జట్టు11.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 85 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఎన్.పీ.కుంట జట్టులో సందీప్ 42 పరుగులతో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్‌రెడ్డి, రామాంజులుయాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలి



నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రవేట్‌పరం చేయడం దారుణం. నేను ఎంతో కష్టపడి చదివితే గత నీట్ పరీక్షలో 503 మార్కులు సాధించా. అయినా సీటు రాకపోవడంతో మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నా. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రవేట్‌పరం చేస్తే మాలాంటి పేద పిల్లల పరిస్థితి ఏంటి. పేద విద్యార్థులకు మేలు చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను నిర్మించింది. ఇప్పుడు వాటిని ప్రవేట్‌పరం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా అన్యాయం.

–జగ్గిరి భవిత, నీట్ విద్యార్థిని, బత్తలపల్లి



పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం



ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించడం సరికాదు. మరోవైపు మెడికల్ కళాశాలల్లో సీట్లను కుదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణం. ప్రభుత్వ చర్యతో ఎందరో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించడానికి లక్షలాది మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న సీట్లను తొలగించాలని కోరడం దారుణం. ఇప్పటికైనా ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలి.

–శిరీంతాజ్, బైపీసీ విద్యార్థిని, తాడిమర్రి

రైల్వేగేట్.. తప్పని లేట్!

రేగాటిపల్లి రైల్వేగేట్ వద్ద వాహనదారుల పడిగాపులు

- గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- అండర్ బ్రిడ్జిని నిర్మించాలంటున్న వాహనదారులు



రేగాటిపల్లి రైల్వేగేట్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ధర్మవరం: పట్టణానికి సమీపంలో నిత్యం రద్దీగా ఉండే రేగాటిపల్లి రోడ్‌లో ఉన్న రైల్వేగేట్ వాహనదారులకు చుక్కలు చూపుతోంది. గేటు దాటాలంటే వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షలు రాయడానికి అటుగా వెళ్లాలంటే గంట ముందు బయలు దేరితే తప్ప గమ్యం సమయానికి చేరే పరిస్థితి లేదు. వివరాలు..పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న రైల్వేగేట్ ద్వారా నిత్యం వేలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గేటు సమీపంలోకి వెళ్లగానే గేటు వేస్తుండటంతో వాహనదారులు వేచి ఉండక తప్పని పరిస్థితి ఉంది. బెంగళూర్, పుట్టపర్తి మీదుగా పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు ఈ గేటు మార్గంగా వెళ్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే 18 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంటుంది. మధ్యలో గూడ్స్ రైళ్లు అదనం. గూడ్స్, ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ రైల్వేగేటు వద్ద సిగ్నల్ ఇవ్వక పోవడంతో గంటల తరబడి నిలబడుతుంటాయి. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

సహనానికి పరీక్ష..

ఈ దారి వెంట ప్రయాణం సహనానికి పరీక్ష పెడుతుందని వాహనదారులు చెబుతున్నారు. గేటు అవతల పలు ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కాలేజీలు ఉన్నాయి. పరీక్షల సమయంలో విద్యార్థులు వెళ్లాలంటే సరైన సమయానికి చేరుకోలేని దుస్థితి ఉంది. రేగాటిపల్లి రైల్వేగేట్ అవతల వైపు ఉన్న విద్యాసంస్థల్లో పరీక్షలు రాయడానికి వెళ్లాలంటే విద్యార్థులు గంట ముందు బయలు దేరాల్సిన దుస్థితి ఉంది. మరోవైపు రేగాటిపల్లి రైల్వేగేట్ అవతల వైపున సుందరయ్యనగర్, దుర్గానగర్, డీఎల్ఆర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, రేగాటిపల్లి, ముచ్చురామి గ్రామాలు ఉన్నాయి. ఈ కాలనీల్లో దాదాపుగా 13 వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. వీరిలో విద్యార్థులు అధికంగా ఉన్నారు. విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం



పరీక్షల సమయంలో రైల్వేగేట్ సమీపంలోకి వెళ్లగానే రైల్వేగేట్ వేస్తున్నారు. ఒక్కోసారి గేటు గంటకు పైగా తీసే పరిస్థితి ఉండదు. దీంతో పట్టణమంతా చుట్టుకుని వేరే మార్గం గుండా పిల్లల్ని తీసుకెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మించాలి.

–చెన్నంపల్లి తిరుమల, సుందరయ్యనగర్, ధర్మవరం

గేటు దాటాలంటే ఇబ్బందులు తప్పడం లేదు



రేగాటిపల్లి రైల్వేగేట్‌కు అవతల వైపున ఉన్నవారు చిన్నపాటి మందులు కొనుక్కోవాలన్నా గేటు దాటి పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. ప్రతిసారి రైల్వేగేటు వద్ద గంటకు పైగా నిరీక్షించాల్సి వస్తోంది. ముఖ్యంగా వాహనదారుల అవస్థలు చెప్పనలవి కాదు. విద్యార్థులు పరీక్షల సమయంలో అరగంట ముందే బయలుదేరాల్సిందే. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–బాలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, ధర్మవరం

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి

తనకల్లు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని జనజాగృతి సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆ సంస్థ కార్యాలయంలో వన్య ప్రాణుల సంరక్షణపై శనివారం సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోడేళ్లు, కప్పలు, చెన్నంగి నక్కలు, కొండకోతులు, అడవి గొర్రెలు, ఎలుగుబంట్లు, అలవలు, నక్కలు తదితర వన్యప్రాణులు అంతరించిపోయే జీవులలో ఉన్నాయన్నారు. జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు కృష్ణారెడ్డి, నాగేంద్ర, రెడ్డెప్పనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓడీచెరువు: వేమారెడ్డి పల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. జరికుంటపల్లికి చెందిన నరసింహులు బైక్‌పై వెళ్తుండగా కదిరి నుంచి బెంగళూరు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మెగా లోక్ అదాలత్‌లో 155 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: స్థానిక కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 155 కేసులను పరిష్కరించినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. రాజీకి అవకాశమున్న కేసులు మాత్రమే పరిష్కరించామన్నారు. భార్యభర్తలను కలిపిన కేసులు 2, బ్యాంకు రుణాలు 31(రూ.9,63,500), గొడవ కేసులు 41, భరణం కేసులు 2 (రూ.4,70,000), చెక్‌బౌన్స్ కేసులు 1(రూ.1.50 లక్ష), ప్రామిసరీ నోటు కేసులు 1(రూ.1.50 లక్ష), భూమి తగాదా కేసులు 1(రూ.5 లక్షలు), ఈపీ కేసులు 1(రూ.50 వేలు), ఇసుక రవాణా కేసులు 23(రూ.5.50 లక్షలు), పెట్టీ కేసులు 52 (రూ.8,25,080)లు పరిష్కరించామని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కదిరిటౌన్: స్థానిక కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 62 కేసులను పరిష్కరించినట్లు మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ జయలక్ష్మి శనివారం తెలిపారు. సివిల్ కేసులు, రాజీ కాబడిన క్రిమినల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు పూల శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, రెండవ బెంచ్ సుజిత్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జడ్జి అధ్యక్షతన నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 76 కేసులు పరిష్కారమయ్యాయి. పుట్టపర్తి బార్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, యధుభూషణ్, చంద్రశేఖర్, ఇందిరా మౌనిక, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా 'సర్దుబాటు'

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు విద్యాశాఖాధికారులు. నిబంధనల మేరకు బాలికల ఉన్నత పాఠశాలకు మహిళా ఉపాధ్యాయులనే నియమించాలి. లేనిపక్షంలో 50 ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులను నియమించాలి. అయితే అవేమీ పట్టించుకోకుండా నల్లచెరువు మండలం దామావాండ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న బీ సంపత్‌నాయక్‌ను ఇంగ్లిష్ సబ్జెక్టుకు సర్దుబాటు చేశారు. ఈయన వయసు 34 ఏళ్లు. గత నెల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సర్దుబాటు ప్రక్రియకు స్వయంగా డీఈఓ మీనాక్షి హాజరు కావడం గమనార్హం. అండర్ ఏజ్ పురుష ఉపాధ్యాయున్ని తమ పాఠశాలకు వేయొద్దని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటాచలం అభ్యంతరం వ్యక్తం చేసినా విద్యాశాఖాధికారులు ఒప్పుకోలేదని సమాచారం. వందలాది మంది విద్యార్థినులు ఉన్న పాఠశాలకు ఇలా పురుష ఉపాధ్యాయులను నియమించడమేంటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పోరాటయోధుడు సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



ధర్మవరంలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లమాడ: పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద శనివారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రంగమ్మ, కో కన్వీనర్ వెంకటేష్, సీపీఎం మండల కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ విద్యార్థి నాయకుడి నుంచి జాతీయ నేతగా ఎదిగిన సీతారాం ఏచూరి విద్యార్థులు, రైతులు, ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఎర్ర జెండా ముద్దు బిడ్డ అయిన ఏచూరి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. ప్రజా ఉద్యమంలో ఏచూరి స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మేరీ సుజాత, కమలమ్మ, మహాలక్ష్మి, రామాంజినమ్మ, రమణమ్మ, సీఐటీయు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీర్చలేని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన ఏచూరి పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, అంజి, ముత్యాలు, యూనియన్ దాసు, మహమ్మద్, రామాంజి, మారుతి, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రజల కోసం నిరంతర పోరాటాలు చేశారని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్ సంఘం కార్యదర్శి చౌడమ్మ, జయమ్మ, భాగ్యలక్ష్మి, యశోద, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి 'ఆచార్య దేవోభవ పురస్కారం'



అవార్డుతో ఉపాధ్యాయుడు గౌస్ లాజమ్

ఓడీచెరువు: కమ్మవారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గౌస్ లాజమ్ ఆచార్య దేవోభవ పురస్కారం అందుకున్నారు. విద్యాబోధనతోపాటు సామాజిక సేవకు గాను శనివారం యువతేజం ట్రస్టు నిర్వాహకులు సర్వేపల్లి రాధకృష్ణన్ ముని మనవడు సుబ్రమణ్య శర్మ చేతుల మీదుగా గౌస్‌లాజమ్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడిని ఎంఈఓలు సురేష్ బాబు, రమణ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తలుపుల: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఈఓపీఆర్డీ శకుంతల, ఈఓ అబ్దుల్ మునాఫ్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో వైద్య, సచివాలయ, పంచాయతీ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. మూడు రోడ్లకూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ధాబా యజమాని ఆత్మహత్య



రమేష్(ఫైల్)

ఓడీచెరువు: జెరికుంటపల్లిలో ధాబా యజమాని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రమేష్(50) గ్రామ సమీపంలో ధాబా పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి భోజనం తర్వాత మిద్దెపై పడుకుంటానని చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత భార్య కమలమ్మ మిద్దె పైకి వెళ్లగా ఉరికి వేలాడుతున్న భర్తను చూసి కేకలు వేసింది. ఇరుగు పొరుగు వారు వచ్చి కిందకు దించారు. అయితే అతడు అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోండి

తాడిమర్రి: మండలంలో సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ నాగస్వామి అధ్యక్షతన జరిగిన ముస్లింల సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదులు, ఈద్గాల వద్ద జరిగే కార్యక్రమాల్లో ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడరాదన్నారు.

వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దాదాపీర్‌పైన అతడి భార్య సోదరుడు, అతని స్నేహితులు కట్టెలతో దాడి చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఇందిరమ్మకాలనీకి చెందిన గుజరి వ్యాపారి దాదాపీర్ భార్య కరిష్మా మూడునెలల క్రితం ఇంటి విషయంలో గొడవపడి పుట్టినిల్లు కదిరికి వెళ్లిపోయింది. శనివారం ఇందిరమ్మకాలనీ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఉన్న దాదాపీర్‌పై కరిష్మా అన్న దాదు, అతని స్నేహితులు బాబ్జాన్, రెడ్డి కట్టెలతో దాడి చేశారు. కుటుంబ సభ్యులు అతనిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్నీతామై అంత్యక్రియలు..



మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: నా అన్నవారెవరూ లేని ఓ మహిళకు అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు ఖిద్మత్–ఎ–ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన సత్యసాయి భక్తురాలు భవాని(40) కొన్నేళ్లుగా గోపురం రోడ్డు ఫస్ట్ క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. వారికి సొంత వారు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్ ఎఖల్క్ సొసైటీ సభ్యులను ఆశ్రయించారు. కమిటీ సభ్యులు షామీర్, అలీ, చాంద్ సాకీర్, సాదిక్ తదితరులు ఆమెకు కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.